# విస్తారమైన పనులు

(దైవ సేవకులకు సమయానుకూలమైన హెచ్చరిక)

భక్త్‌సింగ్

నాల్గవ ముద్రణ : జనవరి 1991
ఐదవ ముద్రణ : సెప్టెంబరు 1995
ఆరవ ముద్రణ : ఆగస్టు 2001

**'Much Business'**

పుస్తకములు కావలసిన వారు ఈ క్రింది అడ్రసుకు
వ్రాయ మనవి

**హెబ్రోను బుక్ రూమ్**
గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్,
హైదరాబాద్ - 500 020.

---

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్ - 44.
ఫోన్స్ : 7618261, 7653348

# విస్తారమైన పనులు

## ధనమోసము

"యెహోషాపాతు.... యూదా దేశపు పట్టణములలో బహు ధనము సమకూర్చెను" (2 దినవృ. 17:12,13).

యూదా రాజైన యెహోషాపాతు దైవ భయముతో తన పరిపాలన బాగుగా ప్రారంభించెను. అతడు తన పితరుడైన దావీదువలె నీతిమార్గములలో నడచుటకు ప్రయత్నించిన మంచి రాజు. తాను భక్తిగా నుండుటతో తృప్తి చెందక, తన యేలుబడిలో ప్రతి సంవత్సరము దేవుని కట్టడలను, విధులను ప్రజలకు బోధించు నిమిత్తము లేవీయులను, అధిపతులను యూదా పట్టణములన్నిటికి పంపుచుండెను. ప్రభువును ఘనపరచుటలో అతనికుండిన ఆసక్తిని బట్టి దేవుడతనిని సమృద్ధిగా నాశీర్వదించెను. ఫిలిష్తీయులు సుంకముగా, కానుకలుగా వెండిని అతని యొద్దకు తెచ్చిరి. అరబ్బీయులు గొఱ్ఱెపొట్టేళ్ళను, మేకపోతుల మందను తెచ్చిరి (7-11 వచనములు). 'నన్ను ఘనపరచు వారిని నేను ఘనపరతును' (1 సమూ. 2:30) అనెడి వాగ్దానమును ఆ విధముగా దేవుడతనిపట్ల నెరవేర్చెను.

దేవుని ఆశీర్వాదము యెహోషాపాతు మీదనుండుట వలన కలిగిన ఫలితములలో ఒకటి సంతానాభివృద్ధి. యెహోషాపాతు క్రమేణ దాతమీద నుండి దానము మీదికి తన దృష్టిని మరల్చెను. ఈ ధనాపేక్ష క్రమేణ అతని జీవితములో స్థలము నాక్రమించుకుని, అతని ఆత్మను అణచి వేయనారంభించెను. ధనాపేక్ష విషయములో మనము కూడ చాలా జాగ్రత్తగా నుండవలెను. ఇహలోక ఆస్తి పాస్తుల యెడల ప్రీతి యెంతో

యుక్తిగా తెలియకుండ మనజీవితములోనికి ప్రవేశించును. శత్రువు మన బలహీనతల నెరుగును. ఆశీర్వాదములలో నిమగ్నులమై, అజాగ్రత్తగా నున్నయెడల సమయమును అదునుగా తీసికొని శత్రువు మన జీవితముల లోనికి ప్రవేశించును.

అనేక సంవత్సరములకు పూర్వము బళ్ళారి సమీపమున నొక ఫ్రాన్సు దేశపు ఇంజనీరు టిప్పు సుల్తాను కొరకు ఒక కోటను నిర్మించెను. ఈ నాటికి కూడ అది ఎంతో గంభీరమై, చొరబడ నసాధ్యమైనదిగా కనబడుచున్నది. కోట నిర్మాణమును ముగించిన పిమ్మట ఎంతో అతిశయముతో ఇంజనీరు టిప్పుసుల్తానును ఆ కోట చుట్టు త్రిప్పి చూపించెను. వారు కోట యొక్క ఒక భాగమునకు వచ్చినప్పుడు, ప్రాకారమునకు వెలుపల సమీపములో నొక కొండయున్నట్లు టిప్పుసుల్తాను గమనించెను. అతడు ఇంజనీరును తీక్షణముగా గద్దించి ఇట్లనెను. "బుద్ధిహీనుడవైన ఇంజనీరూ ఆ కొండను కోటకు వెలుపల వుండునట్లు విడచిపెట్టితివేమి? అది ప్రాకారము లోపలనుండునట్లు గోడను కట్టియుండవలసినది. శత్రువిప్పుడు సులువుగా ఆ కొండెక్కి, దాడిసలిపి సునాయాసముగా కోటను పట్టుకొనగలడు". ఎంతో శ్రమ, ధనము వెచ్చించి ఆ కోటను నిర్మించినను, ఒక ముఖ్యమైన పొరబాటును బట్టి అది నిరుపయోగమైనదిగా చేయబడెను. తన దూరదృష్టి లేమినిబట్టి బహుగా కృంగినవాడై ఆ ఇంజనీరు ఆత్మహత్య చేసికొనెను. కొన్ని సంవత్సరముల తరువాత అదే కొండ నుండి ఆంగ్లేయ సైన్యము దాడి జరిపి, ఆ కోటను స్వాధీనపర్చుకొనెను. మన ఆత్మీయ శత్రువైన సాతాను కూడ మన జీవితములలోని బలహీన స్థలముల ద్వారా ప్రవేశమును సంపాదించుకొని, మనలను నాశనము చేయవలెనని కనిపెట్టుచున్నాడు.

యెహోషాపాతును దేవుడాశీర్వదించినందున అతడు బహుగా వర్థిల్లెను. దేవుడు తన కనుగ్రహించిన దానితో తృప్తి చెంది తన

రాజ్యబాధ్యతలను నెరవేర్చుటకు బదులుగా తన ఐశ్వర్యమును విస్తరింపజేసికొను నిమిత్తము ఎక్కువ పని కల్పించుకొనుటకు యెహోషాపాతు శోధింపబడెను. ధనాశ అతని బలహీనతయైనందున, దానిద్వారా శత్రువు అతని జీవితములోనికి ప్రవేశించెను.

ఈ దినములయందు అదే బలహీనతను, ధనాపేక్ష అనేక బోధకులలో చూచుచున్నాము. దేవుడు వారికిచ్చు దానితో తృప్తి చెందక ఏదో నొక ఇతర పని చేయుటద్వారా తమ ఆదాయమును పెంపు చేసికొనవలెనని కోరుచుందురు. కొందరు కోళ్ళను, మేకలను పెంచుచుందురు. మరికొందరు క్యాలెండర్లు అమ్ముటలోను, అమ్మకముద్వారా తమకు రానున్న ఆదాయమును గురించి కలలు కనుచు నవంబరు, డిశంబరు మాసములలో ఎంతో పని కలిగియుందురు. ప్రభువు కొరకే చేయుచున్నామని చెప్పుకొందురు గాని వారి హృదయములలో డబ్బు కొరకే చేయుచున్నారని వారెరుగుదురు. దైవ సేవకులింత వ్యాపార మనస్కులై యుండుట ఎంత విషాదకరము. ఎక్కడైతే తమకు మంచి రాబడి సూచనలున్నవో, కొంతమంది బోధకులు అటువంటి సంపన్నులున్న ప్రదేశములను దర్శించగోరుదురు. లోకస్థులు ప్రతి సాధ్యమైన మార్గములో ధనమార్జించుటకు ఉపాయములు, ఏర్పాట్లు చేసికొనుట ఆశ్చర్యము కాదు. దైవ సేవకులే ఆ రీతిగా చేయునప్పుడది వాస్తవముగా పరితాపకరము.

# దురాశ కలవరమునకు నడిపించును

2 దిన వృ 17: 14-19లలో యెహోషాపాతును సేవించిన అధిపతులను, సైనికులను గురించి చదువుచున్నాము. వారు పరాక్రమశాలురేగాక దేవుని ప్రేమించి, ఆయనను సేవింపగోరిరి. యెహోవాను సేవించుటకు తమ్మును తాము ఇష్టపూర్వకముగా అప్పగించుకొనినంతటి దైవభక్తి కలిగిన వారని

వీరిలో కొందరి విషయము లేఖనములు చెప్పుచున్నవి. వీరు దురాశ గలవారు కారు. వీరు తమ రాబడితో ఎప్పటికిని తృప్తి చెందక ప్రతి సంవత్సరము సమ్మెచేయు ప్రస్తుత కాలపు ప్రభుత్వోద్యోగుల వంటివారు కారు. వీరు ఇష్టపూర్వకముగా యెహోవాను సేవించుట కర్పించుకొనిన వారైనందున, తన సైనికులకు బత్తెముల నిచ్చుటకు ఎక్కువ ధనము కావలసి వచ్చినదను ఆలోచన యెహోషాపాతుకు లేకపోయెను. అయినను అతడు యూదా పట్టణములలో, విస్తారమైన పనులలో నిమగ్నుడైనట్లు చదువుచున్నాము (తెలుగు బైబిలులో బహు ధనము సమకూర్చబడెనని యున్నది. 2వ దిన వృ 17:13). ధనాపేక్ష యెహోషాపాతు హృదయములోనికి మెల్లగా ప్రవేశించెను.

ధనాపేక్ష అనేక దైవ సేవకుల పతనమునకు కారణము. ఈ విషయములో తాముగాదు తమ భార్య, పిల్లలే వాస్తవముగా నిందింపబడ వలసినవారని వారు వాదించవచ్చును. అంతా ఒకటే. బాధ్యత వారిమీదనే నున్నది.

2 దిన. 18వ అధ్యాయమును చదువునప్పుడు యెహోషాపాతు యొక్క పతనము అచ్చటనే ఆరంభమగుచున్నదని మనమనుకొనవచ్చును. కాని జాగ్రత్తగా పరిశీలించిన యెడల ఆ చరిత్ర 17వ అధ్యాయము 13వ వచనములోనే ఆరంభమైనట్లు కనుగొనగలము. "యూదాదేశపు పట్టణములలో అతనికి బహు ధనము సమకూర్చబడెను" (యూదాదేశపు పట్టణములలో అతడు విస్తారమైన పనులు కలిగియుండెను అని ఆంగ్లభాషలో నున్నది). మొదటిసారి ఇట్లు చదువునప్పుడు ఈ బలహీనత యెహోషాపాతులో స్వల్పమైనదిగా పరిగణించవచ్చును. కాని ఈ చిన్న బలహీనతయే తరువాత గొప్ప పతనమునకు దారితీసిన సంగతి మరచిపోకూడదు. యెహోషాపాతు విస్తారమైన పనులు కలిగినవాడై, అంతకంతకు వర్ధిల్లి బహుగా ధనమును సమకూర్చెననునది వాస్తవమే.

ధనముపట్ల అతని కున్న అత్యధిక ప్రీతిని, అతనిని బలహీన పరచుటకు అపవాది ఉపయోగించెను. అదే రీతిగా సాతాను మొదట నీ జీవితములోనికి కొద్ది ప్రవేశమును సంపాదించుకొని తుదకు పూర్తిగా నిన్ను కూలద్రోయును.

యెహోషాపాతు అహాబుతో వియ్యమందినట్లుగా 2 దినవృ. 18:1లో చదువుచున్నాము. ఇశ్రాయేలీయులను పరిపాలించిన దుష్టరాజులలో ఆహాబు ఒకడు (1 రాజులు 16:30-33). అటువంటి రాజుతో యెహోషాపాతు వివాహ సంబంధములోనికి ప్రవేశించెను. మనము వర్ధిల్లి, ఐశ్వర్యవంతులముగా పేరు పొందినప్పుడు ఈ లోకములో ధనవంతులైన వారి స్నేహమునే వెదకుటకు శోధింపబడుదుము. ధనవంతులైన వారితోను లేక ఉన్నత పదవిలోనున్న ప్రతి వారితోను స్నేహభావము కలిగియుండవలెనని కోరుచుందుము. అచ్చట మంచి మంచి పదార్థములను తినగలమనియేకాక ముఖ్యమైన మనుష్యులను కలిసికొన వీలగునని అనేకమంది తేనీటి విందులకు, భోజన విందులకు పోవుటకు "ఫలాని వ్యక్తి (ప్రసిద్ధి చెందిన వ్యక్తని భావము) నాయొద్దకు వచ్చునని నేనెరుగుదును. మీ వ్యాపార సమస్య, ఉద్యోగపు సంగతి వెంటనే సరిచేయబడునట్లు నేనతనితో మాట్లాడెదను" అని తమ మిత్రులతో పలుకుటలో విపరీతమైన తృప్తిని వారు పొందెదరు.

ఇహలోకపు గొప్ప వ్యక్తుల వెంట పరుగులిడవలయుననెడి అభిలాష కొన్నిసార్లు దైవ సేవకుల మధ్య కూడ కనబడుచున్నది. తమ పిల్లలనో లేక ఇతరుల పిల్లలనో కళాశాలలో చేర్చుటలోనో, వారికి వివాహములు చేయుటలోనో ఎల్లప్పుడు పని కలిగియుండుటచే ప్రార్థనకు, బైబిలు పఠనమునకు వారికి సమయముండదు. కాలమంతా తాము ప్రభువును సేవించుచున్నామనే తలంచుదురు. క్రమేణ ప్రార్థనా భారము వారికి తక్కువైపోవును. మరి అధికముగా లోకమార్గములను, పద్ధతుల నవలంబించుచుందురు, లోక స్నేహితులతో కొన్ని విషయములలో

రాజీచేసికొందురు. దేవునియెడల, ఆయన వాక్యము యెడల బహుస్వల్పమైన గమనము కలిగియుందురు. అనేక దైవసేవకులు లోక పద్ధతులను తమ సేవలోనికి కూడ తెచ్చిరి.

యెహోషాపాతు కుమారుడైన యెహోరాము ఆహాబు కుమార్తెను వివాహము చేసికొనినట్లు 2 రాజులు 8:18లో చదువుచున్నాము. ఇదంత హఠాత్తుగా సంభవించియుండదు. ఆహాబు చాల యుక్తిగలవాడు. అకస్మాత్తుగా వివాహ ప్రస్తావన చేసిన, యెహోషాపాతు వెంటనే దాని నిరాకరించునని అతడెరుగును. యెహోషాపాతు దేవునికి భయపడు వాడు గదా? దేవుని వాక్యమును జనులకు బోధించుటకును, నేర్పించుటకును లేవీయులను, అధిపతులను రాజ్యమందంతట నతడు పంపలేదా? బయలు దేవతా రాధనకును, రాణిబల్ల యొద్ద భుజించు అన్య ప్రవక్తలకును ఆహాబు కుటుంబము ప్రసిద్ధికెక్కినది కాదా? యెహోషాపాతు వంటి దైవభక్తి కలిగిన కుటుంబములోనికి ప్రవేశము సంపాదించుకొనుట సులభముకాదని ఆహాబు రూఢిగా నెరుగును. కనుక బహు యుక్తిగా ఒక రాజు మరొక రాజుతో స్నేహమేర్పరచుకొనునట్లు మొదట యెహోషాపాతుతో నతడు స్నేహబాంధవ్య మేర్పరచుకొనెను. స్నేహమును స్థిరపరచుకొనిన తరువాత మెల్లగా పెండ్లి ప్రస్తావన తీసికొని వచ్చెను.

ఆహాబు ఏ పద్ధతి నవలంబించెనో రూఢిగా మనకు తెలియదు. యథార్థమైన విశ్వాసులను సహితము వంచించుటకనేక పద్ధతులను లోక క్రైస్తవులెరిగియున్నారు. ఆహాబువలె విశ్వాసులతో స్నేహమేర్పరచు కొందురు. ఆ తరువాత, సరియైన సమయములో వారి వివాహ ప్రసక్తిని బయట పెట్టుదురు. అతడు దైవభక్తి కలిగిన మనుష్యుడు గనుక అతని కోడలైన పిదప ఆమెను అతడు మార్చగలడనే సలహాను ఆహాబు, యెహోషాపాతునకిచ్చి యుండవచ్చును. ఏలాగునో యెహోషాపాతు

ఒప్పింపబడెను. అతని కుమారుడు ఆహాబు కుమార్తెను పెండ్లి చేసికొనెను. ఎంత విషాదకరమైన పతనము వివాహము వెంబడి వచ్చినది! యెహోషాపాతు ఎంతో ప్రేమను, ఆసక్తిని దేవుని యెడలను, ఆయన వాక్యము యెడలను కనుపరచిన తరువాత ఇప్పుడు ఈ వివాహము పతనమును తెచ్చినది.

# దురాశ అధోస్థితికి నడుపును

వివాహము తరువాత ఆహాబు సమరయలో విందునకు యెహోషాపాతు నాహ్వానించెను (దినవృ 18:2ను చూడుము). ఆహాబు ఇట్లు పలికియుండవచ్చును, "యెహోషాపాతూ మనమిక పరాయివారము కాదు. మనము స్నేహితులము మాత్రమే కాదు. మనము బంధువులము గనుక మీరు తప్పక వచ్చి మమ్ములను దర్శింపవలెను". మర్యాద కొరకైనా యెహోషాపాతు పోవలసి వచ్చెను. అనేకమార్లు ఈలాగున జరిగియుండవచ్చుననుటలో సందేహము లేదు. యెహోషాపాతు కూడ తన పక్షముగా నాతిథ్యమిచ్చుటకు ఆహాబు నాహ్వానించి యుండవచ్చును.

ఆ విధముగా యెహోషాపాతునకు ఎక్కువ ఇష్టమైన ఆహారమేదో ఆహాబు కనుగొనగలిగెను. ఒక సందర్భమున అతడు శ్రేష్ఠమైన వంట వారిని కుదిర్చి అనేక ఎడ్లను, మేకలను కోయించి, యెహోషాపాతునకు ప్రీతికరమైన ఆహారమును సిద్ధముచేయించి, గంభీరమైన విందును యెహోషాపాతు గౌరవార్థమై ఏర్పాటు చేసెను (2 దినవృ 18:1-2). విందు ముగిసిన పిదప రామోత్గిలాదుమీదికి తనతో పోవుటకు ఆహాబు యెహోషాపాతును ప్రేరేపించెను. అతిథ్యము, రుచిగల భోజ్యములు; పూతపూసిన ఆహాబు మాటలతో రంజింపబడినవాడైన, యెహోషాపాతు, "నేను నీవాడను, నా జనులు నీజనులు, మేము నీతో కూడ యుద్ధమునకు వచ్చెదము" అని ఉత్తరమిచ్చెను (2 దినవృ 18:3).

ఎంతయుక్తిగా శత్రువు పనిచేసెనో గమనించుము. సమరయలోనున్న "నా భవనమునకు రమ్ము" అని గాని లేక "రామోత్గిలాదు మీదికి, నాతో యుద్ధమునకు రమ్ము" అని గాని అహాబు నేరుగా పలుకలేదు. యెహోషాపాతు మీదికి యుక్తితో కూడిన బలమైన వత్తిడిని తెచ్చుటకు సమస్తమును ఎంతో తెలివిగా నతడే ఏర్పాటు చేసెను. మొదట అహాబు యెహోషాపాతుతో స్నేహమేర్పరచుకొనెను. స్నేహము బలపడునంతవరకు అతడూరకుండెను. అప్పుడు యెహోషాపాతు కుమారునికి తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను. ఆ తరువాత యెహోషాపాతు కొరకు గొప్ప విందు ఏర్పాటు చేసి రామోత్గిలాదుమీద యుద్ధమునకు తనతో రమ్మని అతని ప్రేరేపించెను. ఈ సమయమునకు అహాబు వలలో బహుగా చిక్కుబడియుండుటచే ప్రవక్త మీకాయా యిచ్చిన హెచ్చరికను కూడ యెహోషాపాతు లక్ష్యపెట్టలేదు (2 దినవృ 18:18-22).

మొదట యెహోషాపాతు అహాబుతో "నేడు యెహోవా యొద్ద సంగతి విచారణ చేయుదము రండి" అని పలికెను. ఏదైనా ప్రాముఖ్యమైన కార్యమును చేయ పూనుకొనకముందు ఎల్లప్పుడు దేవుని ప్రవక్తలను సంప్రదించుట అతని కలవాటు. ఈ విషయములో కూడ అహాబు సంసిద్ధముగా నుండెను. దేవుని ప్రవక్తలను సంప్రదింపుల నిమిత్తము సిద్ధముగా నుంచెను. ఆ రీతిగా యెహోషాపాతు ఒక ప్రవక్త కొరకడిగినప్పుడు, అహాబు నాలుగువందల మందిని ముందుకు తెచ్చెను. తాను కూడ దేవునికి భయపడు వాడననెడి భావమును యెహోషాపాతునకు కలిగించవలెనని అహాబు కోరెను. అయ్యో! ఏ వ్యత్యాసము లేక ఆ నాలుగువందల ప్రవక్తలందరు ఆత్మీయముగా గ్రుడ్డివారు, వారందరు అహాబుతో, "యుద్ధమునకు పొమ్ము దేవుడు నీతోకూడ నున్నాడు" అని పలికిరి. వారు రాజుల భద్రత విషయము శ్రద్ధ కలిగిన వారు కాదు. హృదయములలో వారీలాగున తలంచిరి. "ఈ రాజులు యుద్ధములో మరణించితే మరణించనీ, మనకేమి?".

ఈ అబద్ధపు ప్రవక్తలవంటి బోధకులనేకులున్నారు. దేవుని వర్తమానమును నమ్మకముగా నందజేయుటకు వారికి శ్రద్ధ లేదు. ప్రజలు ఎటువంటి వర్తమానములు వినగోరుచున్నారో కనుగొని, అటువంటి వర్తమానములే వారికిచ్చెదరు. గొప్ప పలుకుబడి, మంచి భోజనము, ఎక్కువ డబ్బు పొందాలనే వారి కోరిక గనుక వారు ప్రజలకు ప్రీతి కలిగించు పరిచర్యనే జరిపించెదరు.

# దేవుని హెచ్చరిక

యెహోషాపాతు ప్రార్థనాపరుడు. ఈ నాలుగు వందల ప్రవక్తలలో ఏదో పొరబాటు ఉన్నదని గ్రహించెను. అదేవిధముగా ఒక బోధకుడు దైవజనుడో కాదో ఆత్మీయమైన ప్రజలు కనుగొనగలరు. వారు ప్రవచించుచుండగా యెహోషాపాతు విని తనలో తాను ఇట్లనుకొనెను. "వీరు నిజమైన ప్రవక్తలని యనుకొనను" గనుకనే, "వీరు తప్ప యెహోవా ప్రవక్తలలో ఒకడైనను ఇచ్చట లేడా?" అని అతడడిగెను (6, 7 వచనములు). "అవును మరియొక ప్రవక్తయున్నాడు. కాని అతడనిన నాకిష్టము లేదు. నేనతనిని ద్వేషించుచున్నాను. నా కయిష్టమైన సంగతులనే నతడెల్లప్పుడు పలుకుచుండెను" అని ఆహాబు సమాధానమిచ్చెను. యెహోషాపాతును సంతోష పెట్టుటకై తనకు అనుగుణముగా నుండని మీకాయా ప్రవక్తను తెప్పించుమని తన పరివారములో నొకరికి నాజ్ఞ ఇచ్చెను. ఈ సమయములో మీకాయా పలుకబోవు నది ఆహాబు ఎరిగియుండెను. గనుక తన సేవకునితో ఇట్లు చెప్పెను. నీవు మీకాయా యొద్దకుపోయి, నాలుగువందల మంది ప్రవక్తలు పలికిన దానినే నతని చెవిలో చెప్పి, దానినే నతనిని కూడ పలుకుమని చెప్పుము (2 దినవృ. 18:12). ఈ దినములలో కూడ అనేక స్థలములలో ప్రసంగమునకు పూర్వము, ప్రసంగికుని ప్రక్కకు పిలిచి ఏమి బోధించకూడదో చెప్పువారున్నారు. సలహాను పాటించని వారికి

శ్రమ. ఎప్పుడో ఒకప్పుడు దైవసేవకులైన మీరు ఇటువంటి పరిస్థితులనెదుర్కొనెదరు. మీ అడుగులను జాగ్రత్తగా కాపాడుకొనని యెడల మీరు కూడ పడిపోవునవకాశము గలదు. అందులకే ఈ హెచ్చరిక ఎంతో తీవ్రముగా మీకివ్వబడుచున్నది.

మీకాయా నమ్మకమైన దైవ సేవకుడు; ఎంతో యథార్థముగా దేవుని వర్తమానమిచ్చెను (16-22 వచనములు). తన వర్తమానమును సంపూర్ణముగా తేటపర్చుటకు నాలుగు వందల ప్రవక్తలందరి నోటను దేవుడబద్ధములాడు ఆత్మ నుంచెనని మీకాయా ప్రకటించెను. తన పరిచర్యను ఎంతో నమ్మకముగా, ధైర్యముతో నెరవేర్చెను. కాని అహాబు అతని మీద అత్యాగ్రహము గలవాడై, వెంటనే అతనిని చెరలో వేయుట కాజ్ఞాపించెను (26వ వచనము).

మీకాయా యథార్థమైన ప్రవక్తయని యెహోషాపాతు ఎరుగును. అతడు గుణశీలుడు, ఆసక్తియందు అసమానుడు, అయినను, అహాబు ప్రాబల్యముతో అతడు తగ్గిపోవుట ఎంతో పరితాపకరము. వివాహ సంబంధముద్వారా, విందులు, మిత్రుత్వము ద్వారా, అపవాది యతనిని బలహీనపరచెను. మనము ఎన్నడైనా నిష్కపటముగా లేక తెలియక ఏదైనా పొరబాటు జరిగించిన ఆత్మీయముగా బలహీనుల మవుదుము.

అన్యులతోడి వివాహముల విషయమై గంభీరమైన హెచ్చరికలను దేవుడు, ద్వితీయెా 7:3; యెహోషువ 23:12లలో నిచ్చెను. విగ్రహారాధనాలవాట్లకు పేరుపొందిన అన్యురాలైన యెజెబెలును అహాబు పెండ్లి చేసికొనెను. గనుక అతని కుటుంబము వేరే అన్యుల కుటుంబము కన్న మేలైనది గాదు. ఇట్లుండినను యెహోషాపాతు తన కుమారుడైన యెహోరామునకు భార్యగా అహాబు కుమార్తెయైన అతల్యాను అంగీకరించెను. ఆ విధముగా యెహోషాపాతు అహాబు వలలో చిక్కుబడెను.

మీకాయా ప్రవక్త నొక్కి పలుమారులు హెచ్చరించినను బానిసవలె అతడు అహాబుతో యుద్ధమునకు వెళ్ళెను.

యుద్ధరంగమునకు అహాబు తనమట్టుకు తాను మారువేషములో నుండి, రాజవస్త్రము ధరించుకొనుమని యెహోషాపాతునకు సలహానిచ్చెను (2 దిన వృ. 18:29). ఈ తంత్రముతో తన్ను తాను రక్షించుకొని, యెహోషాపాతు వైపు శత్రుగమనమును మళ్ళించవచ్చునని అహాబు తలంచి యుండవచ్చును. మరొకవైపు, యెహోషాపాతు బుద్ధిహీనుడై సాధారణ జ్ఞానమును కూడ కోల్పోయెను. అతని మెదడు పనిచేయుటలేదని గోచరమవుచున్నది. అంతటి జ్ఞానముగల రాజు, "తన మట్టుకుతాను మారువేషములో పోవుచుండగా నన్నేల రాజవస్త్రములు ధరించు కొనవలసినదని కోరుచున్నాడు?" అని తలంచవలసినది. దేవుని కవిధేయులమైనప్పుడు మన మెదడు సరిగా పనిచేయదు, మనము బుద్ధిహీనులవలె ప్రవర్తించుదుము, స్వనాశనమునకు పరుగులిడుదుము.

ఇశ్రాయేలు రాజుతోనేగాని మరి అతని సేవకులలో నెవరితోనైనను యుద్ధము చేయవలదని అహాబు శత్రువు, తన మనుష్యుల కాజ్ఞాపించెను. కనుక ఆ మనుష్యులు సంహరించుటకై ప్రత్యేకముగా రాజును వెదకుచుండిరి. యెహోషాపాతును రాజ దుస్తులలో కనుగొనినప్పుడు ఇశ్రాయేలు సైన్యములోని ఇతరులను విడచి, వారు అతని చుట్టుముట్టిరి. అతడే ఇశ్రాయేలు రాజని తలంచి శత్రువులు మోసపోయిరి. ఏ క్షణములోనైనా చంపబడెడి పరిస్థితి యెహోషాపాతునకు తీసికొనివచ్చెను. యెహోషాపాతు అవలంబించిన ఆ పతన మార్గము అతనినెట్లు అంత్యదశకు - మరణమునకు నడిపించెనో మనము చూచుచున్నాము. ఏ క్షణములోనైనా అతడు చంపబడి యుండవలసినది.

# దేవుడు క్షమించుటకు కనికరముతో కనిపెట్టుచున్నాడు

యుద్ధరంగములో విపత్కాలమున యెహోషాపాతు పశ్చాత్తాపపడెను. యెహోవా అతని రక్షించెను (వ 31). మన దేవుడెంత కనికరముగలవాడు? అతని జీవితములో ఎంతో గ్రుడ్డితనమును, నష్టమును కలుగజేసిన ఆహాబు, యెజెబెలుల ప్రాబల్యమునకు లోనైనప్పటికిని యెహోషాపాతు దైవజనుడే. కనుక యెహోషాపాతు యెహోవాకు మొర్ర పెట్టగా యెహోవా అతనిని రక్షించెను. కాని ఇశ్రాయేలు రాజైన ఆహాబు సంహరింపబడెను (వ. 32). మారు వేషమతనిని కాపాడలేదు.

యెహోషాపాతువలె అనేకమంది క్రైస్తవులు, దైవ సేవకులు కూడ లోక స్నేహితులతో, లోక సమాజములతో ఒడంబడికలు చేసికొనుట ద్వారా ఎంతో నష్టమును, చెరుపును తమ జీవితములోనికి తెచ్చుకొందురు. వారు కూడ ఆత్మీయ లేక శారీరక జీవితము మీద విరక్తి చెందు స్థితికి వచ్చెదరు. పశ్చాత్తాపపడుటకు ఆఖరి నిమిషము వరకు వేచియుందురు. కొందరు తరుణము మించిపోయినట్లు కనుగొందురు.

యెహోషాపాతు సమాధానముగా యూదా దేశమునకు తిరిగి వచ్చినప్పుడు (2 దినవృ 19:1-8) ఆహాబు స్నేహము వలన తనకు సంప్రాప్తించిన నష్టమును తిరిగి సమకూర్చుకొనుటకు ప్రయత్నించెను. యెహోవా కృపగలవాడై తిరిగి అతనికి సహాయము చేయుటకు, శత్రువుల బారినుండి అతనిని విడిపించుట కారంభించెను (2 దిన 20:2; 3:24, 25). అమ్మోనీయులు, మోయాబీయులు, ఎదోమీయులు ఏకథాటిగా అతని మీదికి వచ్చిరి. యెహోషాపాతు భయపడి, ఉపవాస దినమును ప్రకటించి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొనెను.

దేవుడతని ప్రార్థన విని, ఒకరి నొకరు సంపూర్ణముగా నాశనము జేసికొనునట్లు శత్రు సైన్యములో కలవరమును కలుగజేసెను. సైన్య సమూహమంతయు శవములై యుద్ధరంగమున పడియుండెను. కొల్ల సొమ్మును సమకూర్చుకొనుటకు మాత్రమే యెహోషాపాతు, అతని జనులు యుద్ధరంగమునకు పోవలసి వచ్చినది. ఆ కొల్లసొమ్ము విస్తారముగా నుండుటచే దాని కూర్చుకొనుటకు వారికి మూడు దినములు పట్టెను.

# యెహోషాపాతు యొక్క అంతము

ఇంత బాధననుభవించిన తరువాత మిగిలిన జీవితములో యెహోషాపాతు ఎంతో నమ్మకముగానుండునని ఎవరైనా తలంచవచ్చును. తన గొప్ప విజయము (పైన చెప్పబడినది) తరువాత, యెహోషాపాతు తిరిగి తన స్వంత జ్ఞానముపై నాధారపడ నారంభించుట ఎంతో విచారకరము. అతడు మరల ఆహాబు కుమారుడైన అహజ్యాతో స్నేహబాంధవ్య మేర్పరచుకొనెను. గతములో తాను పొందిన విషాదాను భవములన్నిటి తరువాత కూడ యెహోషాపాతు ఇటువంటి పొరబాటు చేయుట విచారకరము గదా! అతనివంటి వారనేకులీరోజుల్లో ఉన్నారు. అదే పాపములో తిరిగి తిరిగి పడుచుందురు. ప్రతిసారి, ఇకనెన్నటికిని దీనిని చేయమని చెప్పుచుందురు. వారి జీవితము ఒక చక్రరూపముగా పడుట, లేచుట, ఒప్పుకొనుట, మరల పడుటయై యున్నది. యెహోషాపాతు, ఆహాబు కుమారునితో ఒప్పందము చేసికొనెను! గత చేదైన అనుభవము పిమ్మట ఇదెట్లు సంభవించెను?

"ఉన్నత స్థలముల దేవతా స్థంభములను యూదాలో నుండి తీసివేసెను" అని దినవృ. 17:6లో చదువుచున్నాము. కాని 20వ అధ్యాయము 33వ వచనములో ఉన్నత స్థలములు తిరిగి వచ్చినట్లుగా కనుగొనుచున్నాము. విగ్రహారాధన తిరిగి వచ్చుటకు యెహోషాపాతు

యొక్క లోక సహవాసములే ఎక్కువగా కారణమై యుండవచ్చును. విగ్రహారాధకుడైన అహాబుతో తమ రాజుయొక్క సరసములను చూచి ప్రజలు ధైర్యము తెచ్చుకొని సమరయలో దూరముగా ఉన్నత స్థలములను తిరిగి నిర్మించిరి.

ఆసియా యంతట ఉన్నత స్థలములలో గుడులను, మసీదులను చూడగలము. రోమన్ కేథలిక్ వారు కూడ మఠాలయములను, మఠములను (కాన్వెంట్సు), పుణ్యస్థలములను ఉన్నత ప్రదేశములలో నిర్మించ గోరుదురు. గుంపులుగా ప్రజలు ఉన్నత స్థలములకు యాత్రలు చేసి కష్టములో ఆదుకొనునని నమ్మి మ్రొక్కుబడులను చేయుదురు. ఉదాహరణకు సంతానములేని వారు, ఇటువంటి స్థలములకు వెళ్ళి, మ్రొక్కుబడులు చేయుటద్వారా తమకోర్కె నెరవేరునని నమ్ముదురు.

రాజైన యెహోషాపాతు తన పరిపాలనా ప్రారంభములో ఉన్నత స్థలములన్నిటిని తొలగించినను ఇప్పుడు ఆత్మీయముగా ఎంతో బలహీనుడై వాటినుండ నిచ్చెను. అతని జీవితములో ఇది ఎక్కువ అంధకారమును తీసికొనివచ్చినది. దూర ప్రదేశములనుండి బంగారము సమకూర్చుటకు ఓడలను పంపుటలో తమతో భాగస్తునిగా చేరమని బలవంత పెట్టిన అహజ్యాతో తన స్నేహమును బలపరుచుకొనెను.

అట్లు రాజైన యెహోషాపాతు తన పరిపాలనను బాగుగా దైవ భయముతో నారంభించుటయు, తుదకు తన జీవితమును సంపూర్ణముగా భంగము చేసికొనుటయు, చేసిన మంచికార్యములను కూడ చెరుపుకొనుటయు చూచుచున్నాము. అతని జీవితమున చొచ్చి, క్రమముగా వ్యాపించి, బలహీనపరచి, పతనమునకు నడిపించిన ధనాపేక్షయే దీనికంతటికి కారణము.

**హెచ్చరిక పొందుదము గాక!**